క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎస్‌హెచ్‌ఓ



ఇల్లెందు: ఇల్లెందు పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా టి.సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం డీఎస్పీ ఎన్.చంద్రభానును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సీఐ సత్యనారాయణ...



టేకులపల్లి: టేకులపల్లి సీఐగా బత్తుల సత్యనారాయణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌ఐలు అలకుంట రాజేందర్, పాడిశెట్టి శ్రీకాంత్‌లు బొకే ఇచ్చి స్వాగతం పలికారు.

దంత సంరక్షణపై శ్రద్ధ వహించాలి

పాల్వంచ: ప్రతీఒక్కరు దంతాల సంరక్షణపై శ్రద్ధ వహించాలని నికోలస్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నవీన్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో రోహిణి ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న దంత వైద్యశిబిరాన్ని సందర్శించారు. వైద్యపరీక్షల విధానాన్ని పరిశీలించి, దంత వైద్య కిట్లను పంపిణీ చేశారు.

'ఈఎల్‌ఐ'ని వినియోగించుకోండి..

పాల్వంచ: ప్రభుత్వం ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహక పథకం (ఈఎల్‌ఐ స్కీం) వినియోగించుకోవాలని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కె.సునీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ ఉదయం 11గంటలకు నవ భారత్ వెంచర్స్ లిమిటెడ్ నందు ఈఎల్‌ఐ స్కీంపై అవగాహన కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి వరంగల్ రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొంటారని, విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

మెడికల్ కార్డు పునరుద్ధరణకు అవకాశం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా విశ్రాంత కార్మికులు, వారి సతీమణులు మెడికల్ కార్డుల పునరుద్ధరణ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య తెలిపారు. బుధవారం ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో మాట్లాడుతూ... ఉద్యోగులు లైవ్ సర్టిఫికెట్లు సమర్పించాలని, ఇల్లెందు ఏరియాలో 125 మంది అందజేయాల్సి ఉందన్నారు. రెన్యూవల్ చేసుకోకుంటే వైద్యం పొందే అవకాశం కోల్పోతారని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి...

కొత్తగూడెంఅర్బన్: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీజేపీ మండలాధ్యక్షుడు మాలోత్ గాంధీనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం హమాలీ కాలనీలో శ్రీ సాయిరాం ఫంక్షన్ హాల్‌లో మండల కార్యశాలలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయాలన్నారు. పైడిపాటి రవీందర్, నరేంద్రబాబు, గొడుగు శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజా నాట్యమండలితో ప్రజల్లో చైతన్యం

పాల్వంచ: నాడు తెలంగాణ ప్రజల్ని నిజాం నిరంకుశ పాలన నుంచి కాపాడేందుకు ప్రజానాట్యమండలి ప్రజల్ని చైతన్యం చేసిందని తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్‌లో జిల్లా 3వ మహాసభ జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సమగ్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలని, అర్హులైన కళాకారులందరికి సాంస్కృతిక సారధిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, కొండల్ రావు, నరాటి ప్రసాద్, సురేందర్, రాము, సాయిబాబు, ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, నిమ్మల రాంబాబు, కృష్ణ, లక్ష్మి, రాజేశ్వరి, కొమరయ్య, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా తెరుచుకోని వ్యవసాయశాఖ భవనాలు

- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా జూలూరుపాడు వ్యవసాయశాఖ కార్యాలయ భవనాలు

జూలూరుపాడు: జూలూరుపాడు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఐదేళ్లుగా షెట్టర్లు తెరుచేకోలేదు. దీంతో భవనాల చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతోపాటు, విషసర్పాలకు నిలయాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం 2020లో మండలంలోని మాచినేనిపేట (పడమటనర్సాపురం), కాకర్ల, జూలూరుపాడు, పాపకొల్లు గ్రామాల్లో రైతు వేదిక భవనాలు నిర్మించింది. ఆనాటి నుంచి వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓ) రైతులు వేదికల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వ్యవసాయ అధికారి (ఏఓ) స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో విధులు కొనసాగించాల్సి ఉండగా, ఏఓ కూడా రైతు వేదికలోనే విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం, విత్తన గిడ్డంగి, రైతు విశ్రాంతి భవనం నిరుపయోగంగా ఉంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవనాల షెట్టర్లు తీయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఏఓ రైతు వేదికల్లో కార్యకలాపాలు కొనసాగిస్తుండటంతో ఏ రైతు వేదికలో ఉన్నారో తెలియక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయశాఖ సమాచారం మేరకు జూలూరుపాడు మండల వ్యాప్తంగా 8,025 మంది పట్టాదారు రైతులు 21,000 ఎకరాల విస్తీర్ణం పంటలు సాగు చేస్తుండగా, 2,626 మంది పోడు రైతులు 7,650 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. 10,651 మంది రైతులు 28,650 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. పంటల సాగుపై రైతులకు ఏఓ సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఏఓ వ్యవసాయశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉండి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే సంక్షేమ పథకాలు రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, పీఎం కిసాన్ యోజన పథకం తదితర పథకాలను రైతులకు వివరించాలి. అదేవిధంగా పురుగు మందుల దుకణాల్లో ఆకస్మిక తనిఖీలు, క్షేత్రస్థాయికి వెళ్లి పంటల పరిశీలన వంటి ఇలాంటి ఎన్నో కార్యక్రమాల గురించి రైతులకు అవగాహన కల్పించాల్సిన ఏఓ వ్యవసాయశాఖ కార్యాలయంలో ఉండకుండా రైతు వేదికల్లో విధులు నిర్వహిస్తుండడంతో నాలుగు రైతు వేదికల్లో ఏఓ ఎక్కడ ఉంటారో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు. గతంలో పని చేసిన ఏఓలు స్థానిక సహకారం సంఘం కార్యాలయంలో పని చేసి, ఆ తరువాత రైతు వేదికల్లో తమ కార్యకలాపాలను కొనసాగించారు. రాష్ట్రావతరణ దినోత్సవం జూన్ 2, స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15, గణతంత్ర దినోత్సవం జనవరి 26న జాతీయ జెండా ఆవిష్కరించేందు తప్ప ఏ రోజు కూడా వ్యవసాయ అధికారి కార్యాలయం, రైతు విశ్రాంతి భవనం షెట్టర్లు తీయడం లేదు. వ్యవసాయ అధికారి కార్యాలయం దెబ్బతిన్నదని, రైతు విశ్రాంతి భవనానికి కిటికీలు లేకపోవడంతో వెలుతురు రావడం లేదని, విద్యుత్, తాగునీటి సౌకర్యం లేదని, అదేవిధంగా టాయిలెట్స్ కూడా లేవని, భవనాలు అనువుగా లేకపోవడం వల్లే రైతు వేదికల్లో పని చేయాల్సి వస్తుందని అధికారులు చెపుతున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయశాఖ కార్యాలయ, రైతు విశ్రాంతి భవనాల చుట్టూ ముళ్ల పొదలు, చెట్లు తొలిగించడంతోపాటు, మరమ్మతులు చేపట్టి భవనాలను అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఉంటున్నాం..



రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నాం. వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం భవనం మరమ్మతులకు గురయింది. రైతు విశ్రాంతి భనానికి కిటికీలు లేవు. విద్యుత్ సౌకర్యం కూడా లేదు. తాగునీటి సరఫరా, టాయిలెట్స్ లేవు. ఐదేళ్లుగా వ్యవసాయశాఖ కార్యాలయ భవనాలు వినియోగించడంలేదు. గతంలో పని చేసిన ఏఓలు కూడా స్థానిక సహకార సంఘం కార్యాలయం, రైతు వేదికల్లోనే విధులు నిర్వహించాల్సి వచ్చింది.

– జి.దీపక్ ఆనంద్, ఏఓ జూలూరుపాడు

రోడ్డుపై గుంతలు పూడ్చండి..



ధర్నా చేస్తున్న శేషగిరినగర్ గ్రామస్తులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్ గ్రామ పంచాయతీ హేమచంద్రాపురం బైపాస్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరుతూ శేషగిరినగర్ గ్రామస్తులు బుధవారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. బైపాస్‌పై పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి నిత్యం వాహనదారులు ప్రమాదాలు గురవుతున్నట్లు వాపోయారు. ఈ రహదారి గుండా బొగ్గు ట్రిప్పర్లు, లారీలు, పాల్వంచ, టేకులపల్లి మహబూబాబాద్, వరంగల్ మీదుగా అనేక వాహనాలు వచ్చిపోతుంటాయని, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గుంతలు చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

ఆగస్టు 3న వైశ్య రాజకీయ రణభేరి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: ఆగస్టు 3న హైదరాబాద్‌లో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించనున్న వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. బుధవారం స్థానిక పట్టణ జీఎస్ కన్‌స్ట్రక్షన్ హాల్‌లో వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు 30 ఎంపీపీ, 30 జెడ్పీటీసీ, ఒక జెడ్పీ చైర్మన్, ఒక మేయర్, 15 మున్సిపల్ చైర్మన్ స్థానాలకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కొదుమూరి దయాకర్, సంతోష్, కుమార్, గిరిధర్, సంక రవి, సర్వేష్, మహంకాళి సాయి, సతీష్, చలవాది ప్రకాష్ పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



ఉధృతంగా ప్రవహిస్తున్న మస్సివాగు

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు వెలవెలబోయిన చెరువులకు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలకళ సంతరించుకుంది. మంగళవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన వర్షంతో వాగులు, వంకలు, చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. రాఘబోయినగూడెం పెద్దచెరువు అలుగు పోస్తోంది. మండలంలోని ప్రధాన వాగులైన మస్సివాగు, ముర్రేడు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మస్సివాగు వెంట ఉన్న చేలలోకి వరదనీరు చేరడంతో ఆయా చోట్ల పంటలు నీటమునిగాయి. వరణుడు కరుణించడం, చెరువులు జలసిరిని సంతరించుకోవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దని పేర్కొన్నారు. మండల ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో 100 డయల్ చేయాలని లేదా 8712682035, 8712682036 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ తరగతులను బుధవారం ఏరియా జీఎం శాలేం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏరియా ఆధ్వర్యంలో జీకే ఓసీ, వీకే ఓసీ ప్రభావిత ప్రాంతాల మహిళలకు సామాజిక బాధ్యత క్రింద తేనెటీగల పెంపకంపై మనబ్ కల్యాన్ వెల్ఫేర్ సొసైటీ, త్రిపుర ద్వారా 100 మంది మహిళలకు ఈరోజు నుంచి శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ అనంతరం సంబంధిత పరికరాలను ఉచితంగా ఇస్తామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి..

పాల్వంచరూరల్: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ దశల వారి ఆందోళనలో కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్ విజయచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే.యాకూబ్‌పాషా, మండల అధ్యక్షుడు ఏ.విజయభాస్కర్, కార్యదర్శి ఎం.రాజులు, సీనియర్ నాయకులు నర్సింహారావు, ఉమాదేవి, సుక్యా, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్లలో 'మహాలక్ష్మి' సంబురాలు



కొత్తగూడెంలో ప్రయాణికురాలిని సన్మానిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కూనంనేని



ఇల్లెందు: ప్రయాణికులకు గిఫ్టులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

చుంచుపల్లి: రాష్ట్రంలో అధికారంలోకి రాగానే మొట్టమొదట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల కోసం చేపట్టిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం వారికి వరం లాంటిదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు ఉచిత ప్రయాణం సంబురాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 200 కోట్ల మహిళలు రూ.6,680 కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్నారని వివరించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయమన్నారు. దీని వెనక ఆర్టీసీ అధికారుల కృషి ఉందని కొనియాడారు. అనంతరం రోజూవారీ ఆర్టీసీలో ప్రయాణించే పలువురు ప్రయాణికులను ఆర్టీసీ అధికారులు సన్మానించారు. ఎస్పీ రోహిత్‌రాజ్, డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఆర్టీసీ డీఎం దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇల్లెందు: ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకం సంబురాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. మాట్లాడుతూ... మహిళలు ప్రభుత్వం పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించిన ప్రయాణికులకు గిఫ్టులు అందజేశారు. డీఎం దేవేందర్‌గౌడ్, ఇల్లెందు డిపో ఇన్‌చార్జ్ సునీత, ఏపీఎం దుర్గారావు, ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'మీ సేవ' కేంద్రాలను సీఎస్‌పీవీఏలకు ఇవ్వాలి

టేకులపల్లి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలకు డిజిటల్ సేవలను అందిస్తూ సీఎస్సీ వీఎల్‌ఏలు (విలేజ్ లెవల్ ఎంట్రప్రెనర్స్) సమర్థంగా పని చేస్తున్నారని సీఎస్‌పీవీఎల్‌ఏ సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ ధరావత్ సాయి కృష్ణ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల నుంచి జిల్లాలకూ వెళ్లకుండానే ప్రజలు డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు, రేషన్, పెన్షన్, స్కాలర్‌షిప్, పాన్‌కార్డు వంటి ఎన్నో ప్రభుత్వ సేవలు పొందడానికి సీఎస్సీ కేంద్రాలు ప్రధాన వేదికగా ఉన్నాయని పేర్కొన్నారు. కానీ ఇటీవల మీసేవ కమిషనర్ తీసుకున్న నిర్ణయం మేరకు మీసేవ కేంద్రాలను ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా మాత్రమే ఇవ్వాలన్నది వీఎల్‌ఏలకు అన్యాయం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మీసేవ సేవలను సీఎస్సీ వీఎల్‌ఏలకు అందుబాటులోకి తేవాలని, గ్రామీణ ప్రజలకు ఒకే కేంద్రంలో అన్నిరకాల సేవలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని, వీఎల్‌ఏల కష్టాలను గుర్తించి ప్రభుత్వ పరిరక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మెడికల్ బోర్డ్ నిర్వహించండి..



సీఎండీతో మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డ్ నిర్వహించి కార్మికులను ఆదుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. బుధవారం సింగరేణి భవన్‌లో చైర్మన్‌ను టీబీజీకేఎస్ బృందం కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. ఈశ్వర్ మాట్లాడుతూ ఏడాదిగా మెడికల్ బోర్డ్‌లో హయ్యర్ సెంటర్‌కు రిఫరల్ కాబడిన రోగులను అన్‌ఫిట్ చేయకపోవడం, విధులకు అనుమతించకపోవటం వలన కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. భూగర్భగనులు, ఓపెన్‌కాస్ట్ గనులు, ప్రాజెక్టులలో అవసరమైన యంత్రాలను తక్షణమే కొనుగోలు చేసి, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరిప్రియనాయక్, పుట్ట మధు, కోకంటి చందర్, దుర్గం చిన్నయ్య, కోలేటి దామోదర్ గుప్తా, టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజీరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, మాదాసి రామ్మూర్తి పాల్గొన్నారు.

కమ్యూనిజంతోనే సమస్యలకు పరిష్కారం

సుజాతనగర్: ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపగలిగే శక్తి కమ్యూనిజానికి మాత్రమే ఉందని ప్రజల కోసం త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలకు ఉందని సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.సోమయ్య అన్నారు. రెండు రోజులు జరగనున్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను బుధవారం సీనియర్ నాయకుడు కొమరరెడ్డి జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. క్లాసులకు ప్రిన్సిపాల్‌గా మండల కార్యదర్శి వర్గ సభ్యులు కాట్రాల తిరుపతిరావు వ్యవహరించగా సోమయ్య బోధించారు. లిక్కి బాలరాజు, ధర్మ, వీర్ల రమేష్, బచ్చలకూర శ్రీనివాస్, కొండేకృష్ణ, నాగ చందర్, బానోతు కుమారి, గండమాల భాస్కర్, భూక్యా శంకర్, బాలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సరిపడా యూరియా అందించాలి



టేకులపల్లి: ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

టేకులపల్లి: అన్నదాతలకు సరిపడా యూరియా అందించాలని, టేకులపల్లి, బొమ్మనపల్లి, బోడు గ్రామాల్లో యూరియా కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ (న్యూడెమొక్రసీ) మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ ఏరియా కార్యదర్శి దుబాకుల ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం న్యూడెమొక్రసీ, ఏఐకేఎంఎస్ టేకులపల్లి మండల కమిటీల ఆధ్వర్యంలో జోరు వానలో తొలుత సొసైటీ కార్యాలయం వద్ద, ఆ తరువాత బస్టాండ్ సెంటర్‌లో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం యూరియా కొరతను సృష్టించి ఆ తదుపరి సబ్సిడీని ఎత్తివేయాలనే కుట్ర చేస్తోందని విమర్శించారు. అధికారులు యూరియా కొరత లేదని చెబుతూనే మనిషికి ఒక కట్ట ఇస్తామని చెప్పడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో భూక్య హర్ష్య, కృష్ణ, రాంబాబు, రామయ్య, సమ్మక్క పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: యూరియా కొరతను నివారించాలని కోరుతూ కొమరారం విక్రయ కేంద్రం వద్ద సేవాలాల్ సేన ఆధ్వర్యంలో బుధవారం రైతులు ధర్నా చేశారు. సేన మండల శాఖ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ మాట్లాడుతూ.. వర్షాలకు పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా కొరత సమస్యగా మారిందన్నారు. విక్రయ కేంద్రం వద్ద సమాచారం చెప్పేవారే లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో మోడెం సంపత్, పూసల శ్రీహరి, గుగులోత్ వినోద్, బానోత్ రాజేష్, జర్పుల కుమార్, రవి, ఆనంద్, రవీందర్, సుజాత, నాజీ, తిరుపతి తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న మాధవనాయక్



ఇల్లెందు: జెండా ఎగుర వేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బీఎంఎస్ కార్యాలయంలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి.మాదవనాయక్ జెండా ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. బీఎంఎస్ 70 ఏళ్లుగా కార్మికుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో లట్టి జగన్మోహన్‌రావు, టీవీ సూరి, జీవీ కృష్ణారెడ్డి, ఊట్ల గణేష్, మొగిలిపాక రవి, మారేపల్లి శ్రీనివాస్, నాగ ప్రసాద్, బి.నాగేశ్వరరావు, ఉప్పు శ్యాంసుందర్, ఉదయ్ భాస్కర్, ఇనుపనూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇల్లెందు: బీఎంఎస్, ఏబీకేఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఇల్లెందులో నిర్వహించారు. బుధవారం జేకేలోని బీఎంఎస్ ఆఫీస్ వద్ద బ్రాంచి ఉపాధ్యక్షుడు నాయిని సైదులు జెండా ఎగురవేశారు. మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సెక్రటరీ లీలాకృష్ణ, వై.నాగేశ్వరరావు, రాజశేఖర్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: బీఎంఎస్ 71వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సంఘ కార్యాలయం వద్ద తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (భారతీయ మజ్దూర్ సంఘ్ జీ445) జెన్‌కో అధ్యక్షుడు గొర్రె వేణుగోపాల్ జెండా ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కార్మిక సంఘ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఎంస్ పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాములు, నన్నెబోయిన రమేష్, కొల్లిపాక రమేష్, జై చంద్ర పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



పాల్వంచ: కొమ్ముగూడెం పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: బంద్ నిర్వహిస్తున్న నాయకులు



జూలూరుపాడులో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు



ఇల్లెందురూరల్: కొమరారం పాఠశాల వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు



టేకులపల్లి హైస్కూల్ వద్ద...